# ప్రభాత సూర్యుడు


తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :148 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 13 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 148 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 13 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### చంద్రబాబు కేసు బెయిల్ విచారణ

## 17వ తేదీకి కోర్టు వాయిదా




**అమరావతి- ప్రభాత సూర్యుడు**

ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోరు గురువారం విచారణ జరిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ కోరుతూ చంద్రబాబు నాయుడు తరపున

మిగతా 2లో...

## గులాబీ హ్యాట్రిక్ సాధ్యమేనా..!

- అందరి కంటే ముందే 115 నియోజకవర్గాలకు అభ్యర్థులు
- యుద్ధంలో దిగకముందే సగం గెలుపు ఖాయం
- ప్రగతి ఆధారంగానే మళ్లీ గెలుస్తామని కేసీఆర్ ధీమా
- 15న హుస్నాబాద్ వేదికగా ఎన్నికల శంఖారావం
- అడ్వాన్సుడ్‌గా అడుగులు వేస్తున్నారు కేసీఆర్
- ఎక్కడా అసమ్మతి అదుపు తప్పకుండా జాగ్రత్తలు
- 15 నుంచి హుస్నాబాద్ నుంచి ఎన్నికల ప్రచారం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

అందరి కంటే ముందే 115 నియోజక వర్గాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. అభ్యర్థుల ప్రకటనతో విపక్షాలకు ఊహించని షాక్ ఇచ్చారు. ఎవరి అంచనాలకు అందని వ్యూహాలతో నెగ్గుకొచ్చే గులాబీ బాస్, ప్రత్యర్థులపై మరోసారి పైచేయి సాధించారు. ఎన్నికలకు ముందే తానేంటో మరోసారి చేసి చూపించారు. ఎన్నికలకు 40 రోజులు ముందే టికెట్లిచ్చామని, గెలుపు విషయంలో సీరియస్ గా ఉండాలని అభ్యర్థులకు చెప్పకనే చెప్పారు. యుద్ధంలో దిగకముందే సగం గెలుపు ఖాయం చేశారు కేసీఆర్. బీఆర్ఎస్ అసంతృప్తుల కోసం ఎదురుచూస్తున్న ఇతర పార్టీలకు, ఆ అవకాశం లేకుండా చేసే ప్రణాళికలు వేశారు. టికెట్లు దక్కనివారు పార్టీలోనే ఉండాలని, తర్వాత మంచి అవకాశాలు వస్తాయని భరోసా ఇచ్చారు. అందుకు అనుగుణంగానే తాడికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, చెన్నమనేని రమేష్ బాబులకు నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టారు. నిన్న మొన్నటి వరకు రాజయ్య, ముత్తిరెడ్డి, తామే అభ్యర్థులమంటూ చెప్పుకొచ్చారు. కేసీఆర్

మిగతా 2లో



## బీజేపీ దూకుడు..!

### ఈనెలలోనే మరో రెండు సార్లు తెలంగాణలో మోదీ పర్యటన

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

బీజేపీ అధిష్టానం దూకుడు పెంచింది. ఈనెలలో మరో రెండు సార్లు తెలంగాణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. ఈ మేరకు ప్రధాని బహిరంగ సభలపై తెలంగాణ బీజేపీ కసరత్తు చేస్తోంది. ఈనెల 27న హుజురాబాద్ లో అమిత్‌షా ఎన్నికల సభ జరగనుంది. తెలంగాణలో పలు నియోజకవర్గాల్లో కేంద్ర మంత్రుల ప్రచారం చేయనున్నారు. 14న శేర్లింగంపల్లి నియోజకవర్గంలో కేంద్రమంత్రి పీయుష్ గోయల్ ప్రచారం చేస్తారు. 15న కేంద్ర మంత్రి సాద్వీ నిరంజన్ జ్యోతి ముషీరాబాద్ నియోజకవర్గ

మిగతా 2లో

## బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మొద్దు

**ఖమ్మం - ప్రభాత సూర్యుడు**



సత్తుపల్లిలో బీఆర్ఎస్ నేతల అరాచకాలు ఎక్కువయ్యాయని.. అధికార మదంతో ఆ నేతలు వీర్రవీగుతున్నారని కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నాడు సత్తుపల్లి కాంగ్రెస్ విజయసంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొంతులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ..'సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారు. సత్తుపల్లిని జిల్లాగా ఏర్పాటు చేస్తాం. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం. తెలంగాణ బిడ్డలు ఆత్మహత్యలు చేసుకోవద్దనే ఉద్దేశంతోనే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలకు ఎన్నికల అప్పుడే ప్రజలు గుర్తుకొస్తారు.. వారి మాయ మాటలు నమ్మకండి" అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తున్నా: ఈటల

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

బీజేపీ ఎమ్మెల్యే, తెలంగాణ బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాను సీఎం కేసీఆర్ పై పోటీ చేస్తున్నట్టు వెల్లడించారు. తన ప్రస్తుత నియోజకవర్గం హుజూరాబాద్ తో పాటు, కేసీఆర్ పోటీ చేసే గజ్వేల్ లోనూ బరిలో దిగుతానని ప్రకటించారు. హుజూరాబాద్ లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈటల ఈ వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్ లో

మిగతా 2లో



## విజయమ్మ షర్మిల పోటీకి సిద్ధం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

కాంగ్రెస్ పొత్తు సక్సెస్ కాకపోవడంతో వైఎస్ఆర్టీపీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. వైఎస్ షర్మిల రెండు స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో వైఎస్ విజయమ్మ కూడా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తో పొత్తు కుదరకపోవడంతో తెలంగాణ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని వైఎస్ఆర్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల డిసైడ్ అయ్యారు. అయితే ఎన్నికల బరిలో తన తల్లి విజయమ్మను నిలపాలని షర్మిల భావిస్తున్నారని సమాచారం. దీంతో పాటు 100 సీట్లలో వైఎస్ఆర్టీపీ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పాలేరు, మిర్యాలగూడ 2 స్థానాలలో షర్మిల పోటీ చేయనున్నారని, సికింద్రాబాద్ నుంచి వైఎస్ విజయమ్మ బరిలో నిలిచే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.ముఖ్యనేతలతో సమావేశం అవుతున్న షర్మిల... నియోజక వర్గాల వారీగా పలువురు అభ్యర్థుల పేర్లు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సూర్యాపేట నుంచి పిట్ట రాంరెడ్డి, సత్తుపల్లి నుంచి కవిత, బోధన్ నుంచి సత్యవతి, కల్వకుర్తి నుంచి అర్జున్ రెడ్డి, వనపర్తి నుంచి వెంకటేశ్వర రెడ్డి, నర్సంపేట నుంచి శాంతికుమార్, అదిలాబాద్ నుంచి బెజ్జంకి అనిల్, చేవెళ్ల నుంచి దయానంద్, గజ్వేల్ నుంచి రామలింగారెడ్డి, సిద్దిపేటలో నర్సింహారెడ్డి, సిరిసిల్లలో చొక్కాల రాము, కామారెడ్డి నుంచి నీలం రమేశ్, అంబర్ పేట నుంచి గట్టు రామచంద్రరావును ఎన్నికల బరిలో నిలిపేందుకు వైఎస్ఆర్టీపీ సన్నాహాలు చేస్తుంది.



## నారా లోకేష్ భారీ ఊరట

- చంద్రబాబు బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా
- పిటిషన్కు కౌంటర్ దాఖలు చేయాలంటూ సీఐడీకి ఆదేశాలు

**విజయవాడ - ప్రభాత సూర్యుడు**

స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్కు భారీ ఊరట లభించింది. లోకేష్పై స్కిల్ స్కామ్ కేసును ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మూసివేసింది. మరోవైపు ఇదే స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్కు కౌంటర్ దాఖలు చేయాలంటూ సీఐడీకి ఆదేశాలు జారీ చేసింది హైకోర్టు. వాదనలను ఈ నెల 17వ తేదీన వింటామని తెలిపింది హైకోర్టు. కాగా, స్కిల్ స్కామ్ కేసులో జ్యుడిషియల్ రిమాండ్ను విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేశారు చంద్రబాబు. మధ్యంతర బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున లాయర్స్, సీఐడీ విచారణకు అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. కోర్టు షరతులకు కట్టుబడి ఉంటానంటూ పిటిషన్లో పేర్కొన్నారు. చంద్రబాబు తరపున దమ్మలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా.. సీఐడీ తరపున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు.

### అధికారులను

## కేటీఆరే బెదిరిస్తున్నారన్నారు

### టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి సాయం చేస్తున్న 75 మంది అధికారుల లిస్టును కేటీఆర్ తయారు చేసి, కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు ఇచ్చినట్లుగా తమ వద్ద సమాచారం ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొంతమంది అధికారులను కేటీఆరే స్వయంగా బెదిరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఈ 45 రోజులు అకుంఠిత దీక్షతో పని చేస్తే అధికారం మనదే అన్నారు. డిసెంబర్ 9న తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడుతుందని, ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ సంతకం ఖాయమన్నారు. తెలంగాణను కేసీఆర్ తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని, కాంగ్రెస్ ఏం చేసిందంటూ బావాబామ్మర్దులు నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. కేటీఆర్ ఆయన కుటుంబం అనుభవిస్తున్న ఈ పదవులు కాంగ్రెస్ పెట్టిన భిక్ష అన్నారు. సోనియా గాంధీ దయతో వారికి మంత్రి పదవులు దక్కాయన్నారు. కేసీఆర్ తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని

మిగతా 2లో

## చంద్రబాబు కేసు బెయిల్ విచారణ
# 17వ తేదీకి కోర్టు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)
న్యాయవాదులు బెయిల్ దాఖలు చేయగా.. విచారణను ఈ నెల 17వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా పిటిషన్‌పై కౌంటర్‌ను దాఖలు చేయాలని సీఐడీని కోర్టు ఆదేశించింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.గత 33 రోజులుగా ఆయన సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. విజయవాడ ఏసీబీ కోర్టులో పలు కేసులు విచారణకు రానున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ కోసం చంద్రబాబు తరఫున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉన్నది. అలాగే అంగళ్లకు సంబంధించిన కేసు ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగనున్నది. అదే సమయంలో ఫైబర్‌నెట్ కేసులో సీఐటీ పీటీ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వారెంట్‌పై విచారణకు ఏసీబీ కోర్టు సమ్మతించింది. దీనిపై మధ్యాహ్నం కోర్టు వాదనలు విననున్నది. ఆ తర్వాత తీర్పును వెలువరించే అవకాశాలున్నాయి.

# బీజేపీ దూకుడు..!

(మొదటి పేజీ తరువాయి)
పరిధిలో పర్యటిస్తారు. 16వ తేదీన కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మహేశ్వరం శాసనసభ నియోజకవర్గంలో పర్యటిస్తారు. 19వ తేదీ మధిర శాసనసభ నియోజకవర్గం పరిధిలో కేంద్రమంత్రి నారాయణస్వామి పర్యటిస్తారు. 20న తెలంగాణలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

# సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)
కార్యకర్తలే అన్నీ నడిపించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ లాగా తాను కూడా రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తానని, రెండింట్లోనూ విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఈటల ప్రకటనపై బీజేపీ అధినాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో నవంబరు 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# అధికారులను కేటీఆరే బెదిరిస్తున్నారన్నారు

(మొదటి పేజీ తరువాయి)
తొమ్మిదేళ్లు ఎదురు చూశారని, కానీ తెలంగాణ ప్రజలను, సోనియాను మోసం చేశారన్నారు. మజ్లిస్ నేత అసదుద్దీన్ కూడా మోదీ, కిషన్ రెడ్డి, రాజాసింగ్‌ల వలె మాట్లాడుతున్నారని విమర్శించారు. తనను భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేయమంటున్నారని, తాను అందుకు సిద్ధమని, మీరు సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలను ఇబ్బందులకు గురి చేస్తోన్న తెలంగాణ డీజీపీని తొలగించాలని రేవంత్ డిమాండ్ చేశారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నవారిపై నిఘా పెట్టారన్నారు. మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీని, తెలంగాణ పోలీసులను హెచ్చరిస్తున్నానని, కాంగ్రెస్‌కు సాయం చేసేవారిని బెదిరిస్తే ఊరుకునేది లేదన్నారు. బిడ్డా కేటీఆర్ గుర్తు పెట్టుకో.. నీ అధికారం ఇంకా 45 రోజులే. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది, మేం వచ్చిన వెంటనే ఇప్పుడు చేసిన దానికి మిత్తితో చెల్లిస్తామని హెచ్చరించారు. అధికారులు అధికారుల్లా వ్యవహరించాలని, బీఆర్ఎస్ కార్యకర్తల్లా వేధించవద్దన్నారు.

# కేసీఆర్‌తో మీటింగ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ సమావేశమైనట్టు సమాచారం. పెండింగ్‌లో ఉన్న అభ్యర్థుల జాబితాతోపాటు ఎన్నికల మేనిఫెస్టో అంశంపై చర్చించారని తెలుస్తోంది. ఇప్పటి వరకు జరుగుతున్న ప్రచారం భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రచార వ్యూహాలపై మాట్లాడుకున్నారని వినికిడి. తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్ రాక ముందు నుంచి బీఆర్ఎస్ తన రాజకీయ వ్యూహాలకు పదును పెట్టింది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి వారిని నిత్యం ప్రజల్లో ఉండేలా ప్లాన్ చేసింది. ఐదు నియోజకవర్గాల్లో ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న రాజకీయ నేపథ్యంలో వీటి ప్రకటన ఆలస్యమవుతోంది. షెడ్యూల్ వచ్చిన వేళ ఆ నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నెల 15 నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచారం స్టార్ట్ చేయనున్నారు. ఈ లోపే జనగామ, నర్సాపూర్, నాంపల్లి, గోషామహల్, మల్కాజిగిరి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఎవరిని పోటీలో పెట్టాలనే విషయంపై క్లారిటీ వచ్చినప్పటికి పార్టీలో ఇతర నాయకులను శాంతింప జేస్తున్నారు. ఈ పనిని మంత్రులు కేటీఆర్, హరీష్‌కు అప్పగించారు కేసీఆర్. జనగామ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సాపూర్ నుంచి సునీతా లక్ష్మారెడ్డి, నాంపల్లి నుంచి ఆనంద్ గౌడ్, గోషామహల్ నుంచి గోవింద్ రాటే, మల్కాజిగిరి మర్రి రాజశేఖర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్నాయి. వారిని అభ్యర్థులుగా ప్రకటిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది వారికి ప్రత్యర్థులుగా ఉన్న వారిని ఎలా సంతృప్తి పరచాలనే అంశంపై చర్చిస్తోంది పార్టీ అధినాయకత్వం. ఇవాళ మంత్రి హరీష్‌రావు, కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో వీటిపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చేపట్టబోయే ఎన్నికల ప్రచారం రూట్ మ్యాప్‌తోపాటు అక్కడ ఏర్పాట్లు ఇవ్వాల్సిన హామీలపై కూడా చర్చించినట్టు సమాచారం.

# గులాబీ హ్యాట్రిక్ సాధ్యమేనా..!

(మొదటి పేజీ తరువాయి)
హామీతో మెత్తబడ్డారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం చేస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ దిగనంతవరకే ప్రత్యర్థులకు ఛాన్స్. వన్స్ కేసీఆర్ స్టెప్ ఇన్, హిస్టరీ రిపీట్ అన్న డైలాగ్ కూడా రాజకీయాల్లోనూ రిపీట్ అవుతుందన్న గ్యారెంటీ బీఆర్ఎస్ నేతల్లో ఉంది. కేసీఆర్ చెప్పినట్టే ఈసారి మెజార్టీ సీట్లు సిట్టింగులకే కేటాయించారు. అభ్యర్థుల్ని కూడా ముందే ప్రకటించేశారు. తమ సంగతేంటో అని ప్రత్యర్థి పార్టీల్లో ఎంతో కొంత చర్చ జరగాలనే కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ప్రత్యర్థులను ఇరుకు పెట్టేలా, పార్టీ పరంగా బీఆర్ఎస్ లో ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా చూసుకున్నారు. ప్రతిపక్షాల్ని గందరగోళపరచాలనే అజెండాతో కేసీఆర్ ముందుకెళ్తున్నారు. ఎప్పుడైనా ముందస్తు నిర్ణయాలతో మంచే జరుగుతుందని కేసీఆర్ భావిస్తున్నారు. తెలంగాణ రాజకీయాలు, భౌగోలిక పరిస్థితులపై కేసీఆర్ ఉన్నంత అవగాహన, క్లారిటీ, రాష్ట్రంలో మరే నేతకు లేదు. ఇంకా చెప్పాలంటే తెలంగాణ ఉద్యమం, జిల్లాల చరిత్ర, సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, ఆయకట్టు గురించి కేసీఆర్ ను కొట్టేవారే లేరు. బీఆర్ఎస్ కు కేసీఆరే కొండంత బలం. ఆయన ముందు తెలంగాణ ఏ పార్టీకి చెందిన నేతలైన దిగదుడుపే. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలు కలిసి పోటీ చేశాయి. దీన్నే కేసీఆర్ అవకాశంగా మార్చుకున్నారు. చంద్రబాబు వచ్చి తెలంగాణలో ప్రచారం చేయడంతో కేసీఆర్ సెంటిమెంట్ ఉపయోగించారు. తెలంగాణలో ఆంధ్రోళ్ల పాలన, బానిసత్వం అవసరమా అంటూ ప్రచారం చేశారు. ఇది బాగా వర్కౌట్ అయింది. కొన్నిచోట్ల సిట్టింగుల మార్పు ఖాయమని ప్రచారం జరిగిన నియోజకవర్గాల్లోనూ అనూహ్యంగా వారికే సీట్లు దక్కాయి. మెరుగైన అభ్యర్థులు లేకపోవడం, వ్యతిరేకత ఉన్నా గెలుపుకు ఢోకా లేదనే అంచనాలతో కొన్ని చోట్ల సిట్టింగ్ లకే ఛాన్స్ ఇచ్చారు. అందరికంటే ముందే అభ్యర్థుల్ని ప్రకటించడం ద్వారా ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టారు. కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థులనే ఎంపిక చేయలేదు. కేసీఆర్ ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతో, నేతలంతా ఒప్పటికే నియోజకవర్గాన్ని రౌండ్ వేసేశారు. కేసీఆర్ వ్యూహాలు ఎవరికీ అంతుచిక్కవని మరోసారి ప్రూవ్ అయిందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూడా సరికొత్త వ్యూహాలు ఉంటాయని చెబుతున్నాయి. ప్రగతి ఆధారంగానే మళ్లీ గెలుస్తామని కేసీఆర్ ధీమాగా చెబుతున్నారు. గత తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసని, వారు తమనే ఆశీర్వదిస్తారని నమ్మకంగా ఉన్నారు. మిగతా పార్టీల్లో అభ్యర్థులు ఖరారయ్యే లోపే బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక విడత ప్రచారం పూర్తి చేసేశారు. ఎక్కడైనా గ్యాప్స్ ఉంటే పూడ్చుకోవడానికి, మరింత బలం పెంచుకోవడానికి అభ్యర్థులకు అవకాశం కల్పించారు గులాబీ బాస్. ఒక్క అభ్యర్థుల ప్రకటనే కాదు, మ్యానిఫెస్టోలోనూ కీలక హామీలుంటాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నెల 15న హుస్నాబాద్ వేదికగా కేసీఆర్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీఆర్ఎస్ కు టఫ్ ఫైట్ తప్పదని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. సీట్లు కూడా తగ్గుతాయని సవాల్ చేస్తున్నాయి. కానీ ఉన్న సీట్లు పెరుగుతాయని బీఆర్ఎస్ నేతలు చెబుతూ వస్తున్నారు. అందుకే తమను ప్రతిపక్షం ఎక్కడా సవాల్ చేసే స్థితిలో లేదని ప్రూవ్ చేయడానికి గత ఎన్నికల మాదిరిగానే అడ్వాన్స్డ్ గా అడుగులు వేస్తున్నారు కేసీఆర్. ఆ విధంగా ప్రజల్లోకి బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రతిపక్షాలవి తాటాకు చప్పుళ్లేననే సంకేతాలు బలంగా పంపాలనుకుంటున్నారు. ఎన్నికల్లో కూడా ఏడుగురు సిట్టింగుల్ని మార్చిన కేసీఆర్, మంచి ఫలితాలే సాధించారు. కొత్తగా టికెట్లు దక్కిన వారంతా విజయం సాధించారు. ఈసారి కూడా సిట్టింగు స్థానంలో గెలిచేవారినే ఎంపిక చేశారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అంతిమంగా గెలవాలనే లక్ష్యంలో రాజీలేదంటున్నాయి. అసలు టికెట్లు దక్కనివారికి కొన్ని నెలలు ముందుగానే అగ్రనేతలు పరోక్ష సంకేతాలు ఇస్తూనే వచ్చారు. కొంతమందికి అయితే నేరుగా ముఖం మీదే చెప్పేశారు. అలా అసంతృప్తిని వీలైనంత వరకు ముందే తగ్గించేలా వ్యూహం రచించారు. ఎక్కడా అసమ్మతి అదుపు తప్పకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక లిస్ట్ ఫైనల్ చేశాం కాబట్టి.. చర్చలు అనవసరం అని కేసీఆర్ చెప్పేశారు. పంచాయితీలు మానేసి.. ప్రచారంపై దృష్టి పెట్టాలనే సంకేతం ఇచ్చేశారు. స్థానిక నేతలతో సమన్వయం చేసుకోవాలని అభ్యర్థులకు కూడా సూచించారు. ప్రత్యర్థులు అభ్యర్థుల్ని ఫైనల్ చేసే లోపే అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఏకతాటిపైకి రావాలనే ఉద్దేశంతోనే మూడ్నెళ్ల ముందే అభ్యర్థుల్ని ప్రకటించారు . 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 88 సీట్లు వచ్చారు. అదే ప్లాన్ ను ఈ ఎన్నికల్లోనూ కేసీఆర్ అమలు చేస్తున్నారు. 15 నుంచి హుస్నాబాద్ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. ఎలాంటి హామీలు ఇస్తారో వేచి చూడాలి.

# వర్శిటీ వెబ్ సైట్ లు అప్ డేట్ చేయండి




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: దేశంలోని యూనివర్సిటీలు, కళాశాలలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కీలక ఆదేశాలు జారీచేసింది. విద్యాసంస్థలన్నీ ఇకపై తమ వెబ్‌సైట్‌లలో ఫీజులు, రిఫండ్ పాలసీ, హాస్టల్ వసతులు, స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్స్, ర్యాంకింగ్స్, అక్రిడిటేషన్ వంటి వివరాలను తప్పనిసరిగా పొందుపరచాల్సిందేనని స్పష్టం చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో పారదర్శకతను పెంచేలా, విద్యార్థులు తప్పుదోవపట్టకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు తమ వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా ఉంచాల్సిన కంటెంట్‌కు సంబంధించి ఓ చెక్ లిస్ట్‌ను విడుదల చేసింది. కొన్ని విశ్వవిద్యాలయాలు తమ వెబ్‌సైట్లలో ప్రాథమిక సమాచారాన్ని కూడా పేర్కొనకపోవడం, కొన్ని వెబ్‌సైట్లు సరిగా పనిచేయకపోవడం, అప్‌డేట్ చేయకపోవడం వంటి అంశాలను గమనించిన తర్వాతే ఈ చర్యలు చేపట్టినట్టు యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలు, కళాశాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం అందుబాటులో లేకపోతే విద్యార్థులకు చాలా అసౌకర్యంగా ఉంటుందని జగదీశ్ కుమార్ అన్నారు. అందువల్లే విద్యాసంస్థలు వెబ్‌సైట్లలో పొందుపరచాల్సిన అంశాలతో చెక్‌లిస్ట్‌ను తయారు చేసినట్టు తెలిపారు. యూజీసీ రూపొందించినఈ చెక్‌లిస్ట్‌లో ఉన్నత విద్యాసంస్థలు/ వర్సిటీల పేటెంట్ల వివరాలు, విదేశీ, పరిశ్రమలతో సహకారం, అంతర్గత నాణ్యత భరోసా కేంద్రం, అంతర్గత ఫిర్యాదుల కమిటీ, హెల్ప్‌లైన్‌తో కూడిన యాంటీ ర్యాగింగ్ సెల్, సమాన అవకాశాలకు సంబంధించిన విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం, అంబుడ్స్‌మన్, అనుబంధ కళాశాలలు, ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విభాగం, పౌర సంబంధాల విభాగం, అప్పిలేట్ అథారిటీ తదితర వివరాలతో యూజీసీ చెక్‌లిస్ట్ రూపొందించింది.

# హాట్ సీట్‌గా పాలేరు

ఖమ్మం- ప్రభాత సూర్యుడు




ఎన్నికల సమయం దగ్గరపడేకొద్దీ, ఖమ్మంజిల్లా పాలేరు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. దీంతో పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం హాట్ సీటుగా మారింది. అందరూ నేతలు పాలేరుపై కన్నేసి.. పోటీకి చేయడానికి రెడీ అవుతున్నారు. రాష్ట్రం లోనే హాట్ సీట్ గా మారిన పాలేరులో ఎవరు పోటీ చేస్తారు. చివరికి పాలేరు గడ్డపై ఏ జెండా ఎగురుతుంది. ఓటర్లు ఎవరికి పట్టం కట్ట బోతున్నారన్నదీ వేచిచూడాలి.అధికార పార్టీ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికే టికెట్ ఇవ్వడంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికీ వైఎస్ షర్మిల పార్టీ కాంగ్రెస్‌లో విలీనంపై స్పష్టత రాకపోవడంతో.. ఆమె సైతం పాలేరు నుంచే పోటీకి సై అంటున్నారు. సిపిఎం పొత్తులో భాగంగా తమ్మినేని వీరభద్రం ఈ సీటు కావాలని పట్టు బడుతున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇద్దరూ పాలేరు టికెట్ కావాలని కోరుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ఇప్పటి వరకూ స్పష్టత రాకపోవడంతో కేడర్‌లో కన్ఫ్యూజన్ నెలకొంది. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న పాలేరు.. ఇపుడు హాట్ సీట్ గా ఎందుకు మారింది.. నేతలు ఇక్కడ నుంచి పోటీ చేయడానికి ఎందుకు ఆసక్తి చూపిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికే టికెట్ ఇవ్వడంతో.. ఆయన నియోజక వర్గంలో ప్రచారంలో ముందున్నారు. అక్టోబర్ 27న ఖమ్మం జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సైతం పాలేరు నుంచే బహిరంగ సభ ద్వారా ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఒక విధంగా పాలేరు పై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించినట్టు కనిపిస్తుంది.కొద్ది రోజులుగా ఎక్కడ చూసినా.. పాలేరు నియోజకవర్గంపైనే చర్చ. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న మూడు జనరల్ స్థానాల్లో పాలేరు ఒకటి. ముఖ్య నేతలు ఎవరి మాట విన్నా.. పాలేరులో పోటీకి రెడీ.. దీంతో రాష్ట్రంలోనే పాలేరు హాట్ సీట్ గా మారింది. నిత్యం వార్తల్లో హాట్ టాపిక్ గా మారుతోంది. పాలేరు నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట. వైఎస్ అభిమానులు, ఇతర సామాజిక వర్గాల ఓటు బ్యాంకు..కాంగ్రెస్ కు బలం. మొన్నటి ఎన్నికల్లోనూ సీనియర్ నేత, బలమైన నేత తుమ్మల నాగేశ్వరరావు సైతం కాంగ్రెస్ అభ్యర్థి కందాల ఉపేందర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇత బలమైన సీటుపై కాంగ్రెస్ ముఖ్య నేతలు కన్నేశారు.. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహారించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇద్దరూ కాంగ్రెస్ లో చేరడంతో.. ఇపుడు ఆ ఇద్దరు నేతలు పాలేరు సీటు కావాలని పట్టుపడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో వారికి ఫాలోయింగ్ ఎక్కువే. జిల్లాలో ప్రభావితం చేయగలిగే ఇద్దరు బలమైన నేతలు ఒక్కటయ్యారు. తమను దూరం చేసుకున్న బీఆర్ఎస్‌ను ఓడించి దెబ్బ కొట్టాలని.. తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు..పాలేరులోనూ.. ఇద్ద లో ఎవరు పోటీ చేసినా గట్టి పోటీ తప్పదు! ఇంత హాట్ సీట్ గా మారిన పాలేరులో బీఆర్ఎస్ గెలుపు కోసం ఏ వ్యూహం అమలు చేస్తోంది. ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఎలా ఎదుర్కోబోతున్నారన్నదీ అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డిది లోకల్. పాలేరు నియోజక వర్గమే. షర్మిల, తుమ్మల, పొంగులేటి.. వీరంతా నియోజక వర్గానికి నాన్ లోకల్. ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.. ఈ అంశమే అధికార పార్టీకి కలిసొస్తుందని భావిస్తున్నారు. ఇక వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పేరుతో వైఎస్ షర్మిల ఎంట్రీతో పాలేరు పాలిటిక్స్ హీటెక్కాయి. గతంలో పాలేరు నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన షర్మిల. ఆ తర్వాత పాలేరు నియోజక వర్గానికి పూర్తిగా దూరమయ్యారు. ఎలాంటి కార్యక్రమాలు లేకుండా సైలెంట్ కావడంతో.. ఆమె పాలేరు నుంచి పోటీ చేయడం లేదనే ప్రచారం జోరుగా జరుగింది. ఈ నేపథ్యంలోనే మరోసారి సడన్ ఎంట్రీ ఇచ్చారు. వైఎస్ జయంతి సందర్భంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఆవిష్కరించి.. విగ్రహం సాక్షిగా పాలేరులోనే పోటీ చేస్తా అని ప్రతిజ్ఞ చేశారు. వెనక్కి తగ్గేదీలేదంటూ.. పోటీ పై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ లో 3,600 కిలో మీటర్లు పాదయాత్ర పూర్తి చేసిన షర్మిల.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో పార్టీ విలీనంపై చర్చలు జరిపారు. కానీ.. ఇప్పటి వరకూ స్పష్టత రాక పోవడంతో..ఆమె తన పార్టీ నుంచే పాలేరులో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. పాలేరు బిడ్డను..ఇక్కడ నుంచే పోటీ చేస్తానని.. ఆమె మట్టి పట్టుకొని మరీ మాట ఇచ్చారు.

## సంపాదకీయం

# ఐదు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలే కీలకం

వచ్చే నెలలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల గెలుపోటములను శాసిస్తూ ప్రభుత్వాలను నిర్ణయించే అంశాలు చాలానే ఉంటాయి.త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో కీలకంగా మారారని అర్థమవుతోంది. అందుకే ఈ వర్గాల ఓట్ల కోసం భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్‌తో పాటు ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు సైతం ఈ దళిత, గిరిజనుల ఓట్ల వేటలో పరుగులు తీస్తున్నాయి. 2018లో దళిత, గిరిజనుల విశ్వాసాన్ని పొందలేకపోవడం వల్లనే బీజేపీ మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ మూడు రాష్ట్రాలతో పాటు తెలంగాణ, మిజోరాం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఐదు రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) కు చెందిన ఓటర్లు అధికార పీఠాన్ని అప్పగించడంలో కీలకంగా మారనున్నారు.రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాల్లో మొత్తం 669 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి, వీటిలో 250 సీట్లు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసి ఉన్నాయి. అంటే మొత్తం సీట్లలో వీరి వాటా 37.36 శాతం. ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మూడింట రెండొంతుల ఎస్సీ-ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో విజయ పతాకాన్ని ఎగురవేసి అధికారాన్ని నిలబెట్టుకోవాలన్న బీజేపీ ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లింది. ఓటర్లను ఆకట్టుకునే హామీలు, మేనిఫెస్టోతో పాటు సిట్టింగ్ ప్రభుత్వాలపై ఉండే సానుకూలత లేదా వ్యతిరేకత సహా ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. వాటిలో కులాలు, మతాలు, వర్గాల పేరుతో ఓటుబ్యాంకుగా ఏర్పడే సమూహాలు కూడా కీలకమే అదే విధంగా తెలంగాణలో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్), మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) దళిత, గిరిజన సీట్లలో మెజారిటీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మాయాజాలం ఈ రిజర్వుడు స్థానాల్లో దాగి ఉండడానికి ఇంతకంటే ప్రత్యక్ష ఉదాహరణ మరొకటి లేదు.దళిత, గిరిజన ఓటర్ల మనసు గెలవకుండా తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం. ఎందుకంటే 18 శాతం ఎస్సీ, 12 శాతం ఎస్టీ ఓటర్లు రాష్ట్రంలో ఉన్నారు. రాష్ట్రంలోని ఓటర్లలో దాదాపు 30 శాతం మంది ఈ రెండు వర్గాలకు చెందినవారే. ఈ కారణంగా తెలంగాణలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో 31 సీట్లు రిజర్వ్ స్థానాలుగా ఉన్నాయి. వాటిలో 12 సీట్లు ఎస్టీకి, 19 సీట్లు ఎస్సీకి రిజర్వ్ అయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక రిజర్వ్‌డ్ స్థానాలను కైవసం చేసుకోవడంలో కేసీఆర్ పార్టీ విజయం సాధించింది. దళిత ముఖ్యమంత్రి, దళితులకు 3 ఎకరాల వ్యవసాయ భూమి, దళిత బంధు వంటి పథకాలను కేసీఆర్ తీసుకొచ్చి వారిని ఎప్పుడూ తమవైపే ఉండేలా చూసుకుంటున్నారు. గిరిజనుల కోసం కోసం కొన్ని పథకాలను ప్రకటించారు. అయితే పథకాలు ప్రకటించిన స్థాయిలో అమలుకావడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పరిస్థితుల్లో దళిత, గిరిజనులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా అనేకరకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. మిజోరం రాజకీయాలు గిరిజన సంఘాల చేతుల్లో ఉన్నాయి. ఎందుకంటే ఈ రాష్ట్రం మొత్తం ఎత్తైన పర్వతాల మధ్య కొలువై ఉంది. రాష్ట్రంలోని మొత్తం 40 సీట్లలో 39 సీట్లు ఎస్టీ కమ్యూనిటీకి, ఒక సీటు జనరల్ కేటగిరీకి రిజర్వ్ అయింది. మిజోరాంలో ఎస్సీ వర్గానికి ఒక్క సీటు కూడా లేదు. 2018 ఎన్నికలలో మిజో నేషనల్ ఫ్రంట్ ప్రజలను ఆకట్టుకోగల్గింది. కానీ కానీ ఈసారి సవాళ్లను ఎదుర్కొంటోంది.రాజస్థాన్ రాజకీయాల్లో దళిత, గిరిజన ఓటర్లు చాలా నిర్ణయాత్మకంగా ఉన్నారు. 17 శాతం దళితులు, 13 శాతం గిరిజన ఓటర్లు ఉన్నందున రాష్ట్రంలో అధికారాన్ని ఈ రెండు వర్గాల ఓటర్లే నిర్ణయిస్తారు. రాజస్థాన్‌లోని 200 అసెంబ్లీ సీట్లలో దాదాపు 30 శాతం అంటే 59 సీట్లు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేయగా.. అందులో 34 సీట్లు ఎస్సీలకు, 25 సీట్లు ఎస్టీలకు కేటాయించారు. 2013 ఎన్నికల్లో 45 రిజర్వ్‌డ్ స్థానాలు గెలుచుకుని రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న బీజేపీ 2018లో 21కి పడిపోయింది. బీజేపీ 11 ఎస్టీ, 10 ఎస్సీ స్థానాల్లో విజయం సాధించింది. 2013లో కాంగ్రెస్ 7 రిజర్వ్‌డ్ స్థానాలను మాత్రమే గెలుచుకుంది. 2018 నాటికి కాంగ్రెస్ బలం 34 సీట్లకు (21 ఎస్టీ, 13 ఎస్సీ) పెరిగింది. ఫలితంగా విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ఈ గణాంకాలే రాజస్థాన్‌లో ఎస్సీ-ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లలో అధికార మాయాజాలం ఎలా దాగి ఉందో స్పష్టంగా చెబుతున్నాయి. అందుకే ఈ స్థానాల్లో గెలుపు కోసం బీజేపీ, కాంగ్రెస్ లు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి.మధ్యప్రదేశ్‌లోని దళిత, గిరిజన ఓటర్లకు ఏ పార్టీనైనా ఆట కట్టించగల శక్తి ఉంది. ఈ రాష్ట్రంలో 16 శాతం ఎస్సీ, 21 శాతం ఎస్టీ ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలోని మొత్తం 230 అసెంబ్లీ స్థానాల్లో 82 సీట్లు ఎస్సీ-ఎస్టీలకు రిజర్వు కాగా, అందులో 47 సీట్లు ఎస్టీకి, 35 సీట్లు ఎస్సీలకు కేటాయించారు. 2013 ఎన్నికల్లో 82 రిజర్వ్‌డ్ స్థానాల్లో 53 గెలుచుకోవడంలో బీజేపీ విజయం సాధించగా, 2018లో 25 సీట్లకు పరిమితమై ఓటమిపాలైంది. 2013లో 12 రిజర్వ్‌డ్ స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ గెలుపొందగా, 2018 ఎన్నికల్లో 40 సీట్లకు చేరుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విజయం సాధించింది. అందుకే ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లను రాబట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్ లు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.ఛత్తీస్‌గఢ్ రాజకీయాలు గిరిజన, దళిత సంఘాల చుట్టూ కేంద్రీకృతమై ఉన్నాయి. రాష్ట్రంలో 34 శాతం గిరిజన ఓటర్లు ఉండగా వారికి 29 సీట్లు రిజర్వ్ అయ్యాయి. దళితులు 11 శాతానికి చేరువలో ఉండగా వారికి 10 సీట్లు రిజర్వ్ అయ్యాయి. అలా మొత్తంగా రాష్ట్రంలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో 39 స్థానాలు ఎస్సీ-ఎస్టీలకు రిజర్వ్ అయ్యాయి, 2018 ఎన్నికల్లో 39 రిజర్వ్‌డ్ స్థానాల్లో బీజేపీ 6 మాత్రమే గెలుచుకోగలిగితే, కాంగ్రెస్ 29 ఎస్టీ సీట్లలో 28 గెలుచుకుంది. అలాగే 6 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో విజయం సాధించింది. ఈ గెలుపే కాంగ్రెస్ మెజారిటీకి ఉపయోగపడింది. తద్వారా 15 సంవత్సరాల తర్వాత మళ్లీ తిరిగి అధికారంలోకి రాగలిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఎస్సీ-ఎస్టీల సీట్లలో గెలుపు కోసం రెండు పార్టీలు శాయశక్తులా ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

# దూర ప్రాంతాలలకు నాన్ ఏసీ బస్సులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణలో త్వరలోనే సుదూర ప్రాంతాలకు మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం విజయవాడ మార్గంలో 10 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు నడుస్తుండగా తొలిసారిగామిగతా రూట్లలోనూ ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి తేనున్నట్లు టిఎస్ఆర్టీసీ వెల్లడించింది. ఇప్పటికే 1,860 నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డర్ ఇచ్చిన సంస్థ వాటిలో కొన్నింటిని డిసెంబర్‌లో వాడకంలోకి తెచ్చేలా ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే హరియాణా పల్వాల్‌లో ఏఃఓ గ్రూప్ సంస్థలో తయారవుతున్న కొత్త ఎలక్ట్రిక్ బస్సుల నిర్మాణాన్ని ఆర్టీసీ సజ్జనార్ పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులను తనిఖీ చేశారు. ఆర్టీసీకి అందిస్తున్న 2 నమూనా బస్సులు పరిశీలించారు. జేబీఎం గ్రూప్‌కి చెందిన ప్రశాంత్‌శర్మతో చర్చించి పలుసూచనలు చేశారు.బస్సుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందించాలని సజ్జనార్ విజ్ఞప్తిచేశారు. ప్రయాణికుల సౌకర్యాల్లో రాజీ పడకుండా అత్యాధునిక హంగులతో వాడకంలోకి తీసుకువస్తున్నట్లు సజ్జనార్ వివరించారు. తెలంగాణలో నాన్ ఏసీ విద్యుత్ బస్సుల్ని రోడ్డు ఎక్కించేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. దాదాపు 500 బస్సుల్ని అద్దెకు తీసుకోవాలని కూడా సంస్థ నిర్ణయించింది. తొలిసారిగా ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ విభాగాల్లో విద్యుత్ బస్సుల్ని ప్రవేశపెట్టనుంది. డిసెంబరు నుంచి నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల్ని దశలవారీగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది.నిజానికి ఆర్టీసీలో చాలా బస్సులు కాలం చెల్లినవే. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా సంస్థ కొత్త బస్సుల్ని కొనుగోలు చేయకుండా పాత వాటినే ఉపయోగిస్తోంది. కానీ ఇప్పుడిప్పుడే విద్యుత్ బస్సుల వైపు మొగ్గు చూపుతోంది. ప్రస్తుతం ఆర్టీసీలో ఏసీ సర్వీసుల్లో మాత్రమే ఎలక్ట్రిక్ బస్సులుండగా.. నాన్ ఏసీలోనూ వాటిని ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో వివిధ సంస్థలకు మొత్తం 1,860 ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డర్ ఇచ్చింది. వీటిని కూడా అద్దె పద్ధతిలో తీసుకోనుంది. బస్సులు తిరిగిన దూరానికి కిలోమీటర్ల వారీగా చెల్లింపులుంటాయి.

వీటిలో 10 విద్యుత్ డబుల్ డెక్కర్ బస్సుల్ని హైదరాబాద్‌లో నడపనుంది. సాధారణంగా ఇప్పుడు వాడుతున్న 12 మీటర్ల పొడవు గల ఈ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు అన్నీ హంగులని కలిగి ఉనాయి. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఫోన్ చార్జింగ్ సౌకర్యంతో పాటు సీటు బెల్ట్ సదుపాయం కూడా ఉంటుంది. ప్రతీ బస్సులోనూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే బస్సు రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా కూడా ఉంటుంది. ఇప్పుడు కొత్తగా అద్దెకు తీసుకొనే నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల్లో కూడా వీలైనన్ని సదుపాయాలు ఉండేలా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ బస్సులవల్ల వాయు, శబ్ధకాలుష్యం లేకుండా ఉండటంతో పాటూ సౌకర్యవంతమైన ప్రయాణం,అగ్ని నిరోధక వ్యవస్థ, గమ్యస్థానం వివరాలు తెలిపే ఎల్ఈడీ బోర్డుల వంటి అధునాతన హంగులుంటాయని ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో వివరించారు.ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం ఆర్డర్ ఇచ్చిన ప్రకారం వచ్చే రెండు మూడు నెలల్లో వెయ్యి విద్యుత్ బస్సులు రాబోతున్నాయి. వీటిలో కొన్ని బస్సులను మాత్రమే ఏసీగా మార్పు చేసి, మిగిలిన వాటిని నాన్ ఏసీ బస్సులుగా నడిపిస్తారు.

# ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో 620 ప్రత్యేక రైళ్లు..

- ప్రత్యేక రైళ్ల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్న రైల్వే శాఖ
- రెగ్యులర్ టికెట్ చార్జీలపై 30 నుంచి 50 శాతం అదనంగా వసూలు



హైదరాబాద్ అక్టోబర్ 12
ఎస్‌సీఆర్ జోన్ ఆధ్వర్యంలో రెగ్యులర్ రైలు సర్వీసుల సంఖ్య తగ్గిస్తూ.. ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్ వంటి డివిజన్ల పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 620 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.కాగా దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ బాదుడు షురూ చేసింది. పేద, మధ్య తరగతుల ప్రయోజనాలు పక్కన పెట్టి ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నది. పండుగల సందర్భంగా నగర వాసులు తమ సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావించిన దక్షిణ మధ్య రైల్వే రెగ్యులర్ విధానంలో కాకుండా ప్రత్యేక రైళ్లను అధిక సంఖ్యలో నడుపుతూ చార్జీలను అమాంతం పెంచేసింది. ప్రస్తుతం రెగ్యులర్ టికెట్ చార్జీలపై అదనంగా 30 నుంచి 50 శాతం వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులకు రైల్వే చార్జీలు తలకు మించిన భారంగా మారుతున్నది. పైగా రిజర్వేషన్‌కు దాదాపు రెండు నెలలు ముందుగానే టికెట్ బుక్ చేసుకున్నా.. సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. అంతా వెయిటింగ్ లిస్టు, ఆర్ఏసీతోనే సరిపోతుంది. ఒక వేళ టికెట్ బుక్ చేసుకుని, టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే అందులో కూడా 25 నుంచి 50 వరకు చార్జీలు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

# పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు మౌళిక సదుపాయాలు కల్పించాలి

## అదనపు కలెక్టర్,డిప్యూటి ఎన్నికల అధికారిణి బి.ఎస్. లత

జగిత్యాల - ప్రభాత సూర్యుడు

పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు మౌళిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్, డిప్యూటి ఎన్నికల అధికారిణి బి.ఎస్. లత అన్నారు.గురువారం రోజున ఐడీవోసీ లోని తన చాంబర్ నుండి ఆర్డీవోలు, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తహశీల్దార్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ లో జరుగనున్న శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా లోని పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంపులు, రేలింగ్స్, ఫర్నిచర్ వంటి సౌకర్యాలపై ఆయా మండల తహశీల్దార్లతో సమీక్షిస్తూ, పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఉండే విధంగా ఆయా ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. దివ్యాంగులకు ర్యాంపుల ఏర్పాట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా వివరాలను పరిశీలించి స్విచ్ బోర్డ్ లను, ఫ్యాన్లు నడిచే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని, లేని యెడల అవసరమైన మరమ్మతులు చేయించాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లోని మరుగు దొడ్లు లేని పోలింగ్ కేంద్రాలలో ఉపాధి హామీ పథకం కింద నిర్మాణాలు చేపట్టాలని పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఎన్నికలను సజావుగా,ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మండల తహశీల్దార్లు పోలింగ్ కేంద్రాలలోని వసతులను పరిశీలించాలని సూచించారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన పనులను ఆయా ఇంజనీరింగ్ అధికారులు సకాలంలో పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. కాన్ఫరెన్సులో ఆర్డీవోలు నరసింహ మూర్తి, రాజేశ్వర్ ,వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

# 3,4,8,9 తేదీలు... శుభముహూర్తాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: తెలంగాణలో ఎన్నికల నగారా మోగింది. నామినేషన్లకు కూడా త్వరలో తెరలేవనుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3న నామినేషన్లకు నోటిఫికేషన్ వస్తుంది. నవంబర్ పదో తేదీ దాకా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అయితే, తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు.. ఒక్క అధికారపార్టీ బీఆర్ఎస్ మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది.. బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు త్వరలోనే అభ్యర్థులకు బీ ఫాంలను అందించనున్నారు. మంగళవారం మంగళకరమైన రోజుగా భావించి ఆ రోజే పనులు చేపట్టేందుకు మొగ్గుచూపేవారూ ఉన్నారు. ఆ కోవలో కొందరు రాజకీయ నేతలు మంగళవారం రోజే నామినేషన్లు వేస్తారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఇద్దరు మంత్రులు, వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ నేత, ధనిక వర్గాలు ఎక్కువగా ఉండే ఓ నియోజకవర్గానికి చెందిన నేత, బీజేపీ కీలక నేత ఒకరు, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఓ సీనియర్ నేత ఇలా కొందరు ఈరోజుకు ప్రాధాన్యం ఇస్తారు.రాజకీయ భవిష్యత్‌ను ఓటర్లు ఎలా నిర్ణయించే అవకాశం ఉందో చెప్పమని నేతలు పండితుల వద్ద క్యూ కడుతున్నారు. పుట్టిన తేదీ, వారి నక్షత్రం.. ఇలా గోచార బలాన్ని తెలుసుకుంటున్నారు. సిటీకి చెందిన ఓ మంత్రికి ఈసారి అనుకూల యోగం లేదన్న సమాచారంతో వారి కుటుంబం పరిహార పూజలు ప్రారంభించిందట. ఇక బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఓనేత తరపున ఆయన భార్య పూజల్లో నిమగ్నమయ్యారట. విపక్ష పార్టీలు కాంగ్రెస్, బీజేపీ త్వరలోనే టికెట్లను ప్రకటించనుంది.నామినేషన్ల దాఖలుకు దాదాపు నెల సమయం ఉంది. అయితే, ఇప్పటికే టికెట్ డిసైడ్ అయిన అభ్యర్థులు.. టికెట్ వస్తుందని ఊహగానాల్లో ఉన్న పలు పార్టీల ఆశావహులు.. ఏ రోజున నామినేషన్ వేయాలి, ఏ రోజు ముహూర్తం బాగుంది..? అనే విషయాలు తెలుసుకోవడానికి పండితుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం..అయితే, నామినేషన్లు వేయడానికి ఆ నాలుగు రోజులను మించి ముహూర్తం లేదట. దీంతో నేతలు ఆ నాలుగు రోజుల్లోనే నామినేషన్ వేయడానికి రెడీ అవుతున్నారుట. నామినేషన్లకు నవంబర్ 3, 4, 8, 9 తేదీలు బాగున్నాయని పండితులు చెబుతున్నారు. ఆ 4 రోజుల్లో తిథి, నక్షత్ర బలం బాగుందని చెబుతున్నారు. దీంతో ఆయా రోజుల్లో ఏ టైమ్‌కి నామినేషన్ వేయాలి అనే విషయంపై పండితులను సంప్రదిస్తున్నారు నేతలు. ఆ 4 రోజుల్లోనే మ్యాగ్జిమమ్ నామినేషన్లు దాఖలవుతాయని భావిస్తున్నారు.నవంబర్ 3.. ఉత్తర నక్షత్రంతో కూడిన శుక్రవారం ముహూర్త బలం బాగా ఉందిట.

# స్కూటర్ లో మూడు లక్షల నగదు

## స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ఖమ్మం- ప్రభాత సూర్యుడు:** ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఖమ్మంలో అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ ప్రాంతం బోస్ బొమ్మ సెంటర్ వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారిని సుమలత ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 3 లక్షల నగదును పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఓ వ్యక్తి కొప్పుల వెంకటేశ్వర్లు యాక్టివా స్కూటీలో తరలిస్తున్న నగదును సీజ్ చేశారు. ఈ వాహన తనిఖీల్లో త్రీ టౌన్ సీఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. పట్టుబడ్డ నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సుమలత పోలీసుల సమక్షంలో డిపాజిట్ చేశారు.

# తాండూరు లో రూ 7.96 లక్షలు సీజ్

**వికారాబాద్ - ప్రభాత సూర్యుడు:** ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.7.96 లక్షలను తాండూరు పోలీసులు సీజ్ చేసారు. ఎవరైనా 50 వేలకు మించి డబ్బులు తరలించకుండా పోలీసులుకట్టడి చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు గురువారం తాండూరు పట్టణంలోని విలియం మూన్ చౌరస్తా వద్ద పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్ పై వస్తున్న వ్యక్తి వద్ద డబ్బులను గుర్తించారు. అతని వద్ద నుంచి రూ. 2.50 లక్షలను తాండూర్ పట్టణంలో మరో దగ్గర రూ.5.46 లక్షలను మొత్తం రూ.7.96 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రం లేకపోవడంతో సీజ్ చేసారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పట్టుబడిన డబ్బులను స్క్రీనింగ్ కమిటీ ముందు అప్పగించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ధూపత్రాలను చూపిస్తే సీజ్ చేసిన డబ్బులను తిరిగి అప్పగిస్తామని తెలిపారు.

# కేంద్ర నిధులతోనే రాష్ట్ర సంక్షేమ పథకాలు

**నల్గొండ- ప్రభాత సూర్యుడు:** ప్రాణాలకు తెగించి కొట్లాడి సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో ప్రజల కనీస ఆకాంక్షలు కూడా నెరవేరలేదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శోభకరం ధ్లాజే అన్నారు.. రాష్ట్రంలో రైతంగం పరిస్థితి దయానియంగా మారిందని చెప్పారు. నల్గొండ జిల్లా నాగర్జున సాగర్ జరిగిన బిజెపి అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముఖ్యుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.. పలు అభివృద్ధి పథకాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న లక్షల కోట్ల నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. వాటికే పేర్లు మార్చి బిఆర్ఎస్ ప్రభుత్వం సొంత ప్రచారం చేసుకుంటుందన్నారు. పదేళ్ల కెసిఆర్ బంగారు తెలంగాణ పాలనలో అయినా కుటుంబమే బంగారం గా మారింది కానీ ప్రజలకు ఏమేలు జరగలేదని విమర్శించారు. సీఎం ఫామ్ హౌస్ లో పడుకుంటే ఆయన కుటుంబం అవినీతిలో మునిగి తేలుతుందని అన్నారు. ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా మార్పు కోరుకోవాలని బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని గుర్తించాలన్నారు.

# సమాచార హక్కు చట్టం ఒక ఆయుధం




**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు:** సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సమాచార హక్కు చట్టం జాతీయ అవగాహన సదస్సు గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాష్ ముదిరాజ్ హాజరైనారు. ఈ సందర్భంగా బండా ప్రకాష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అవినీతిపరుల అటకట్టించేందుకు దోహద పడుతుంది ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు తనకు కావలసిన ఏ సమాచారం అయినా పొందే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు. సమాచార హక్కు చట్టం ఎంత గొప్పదో అంత నిర్లక్ష్యం చేయబడ్డది. ఏ రంగం లో నైనా చేస్తున్న పని ప్రజలకు స్పష్టంగా తెలియాలి . ప్రభుత్వ పరంగా జరిగేది ఏదైనా ప్రతీ పౌరుడికి తెలుసుకునే బాధ్యత ఉంటది. సమాచార హక్కు చట్టం కింద సమాచారం సేకరించడం ఒక ఆయుధంగా ఉపయోగపడుతుంది. సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో క్రియా శిలకంగా ఉంటుంది. చాలా విషయాలలో సమాచార హక్కు చట్టంఅనగానే చాలామందికి భయం ఉంటది. ప్రజలు చైతన్యవంతం అయితే తప్ప సమాజంలో మార్పు రాదని అన్నారు. సమాచార హక్కు చట్టం గురించి వీలైనన్ని సదస్సులు జరిపి అవగాహన కల్పించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సమాచార హక్కు చట్టం గురించి నేర్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమితి చైర్మన్ కేశవులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్టిఐ చీఫ్ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ ముక్తేశ్వర్ రావు, రిటైర్డ్ సిబిఐ అధికారి బాలకిషన్ రావు, రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి, ఐఎఫ్ టి యు అధ్యక్షులు వెంకటేశ్వర్లు, , మిని అంగన్ వాడి టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్ వేర్ సంస్థలో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్-- ప్రభాత సూర్యుడు :** హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని కెడ్సైస్ సాఫ్ట్ వెర్ కంపెనీ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. తెలుగు అకాడమీ ఎదురుగా ఉన్న తిరుమల ఎస్టేట్ లోని రెండవ అంతస్తులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఉదయం కార్యాలయానికి చేరుకున్న ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. సర్వర్ రూమ్ లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో కార్యాలయంలోని కంప్యూటర్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఉద్యోగులు అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు.

# ఐకమత్యంగా ఉండేందుకు కృషి

## మాల్ వెల్ఫేర్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు యాట వెంకటయ్య



**యాచారం - ప్రభాత సూర్యుడు:** సమాజంలోని మెకానిక్, ఎలక్ట్రీషియన్ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సంఘం అధ్యక్షుడు యాట వెంకటయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ వెల్ఫేర్, టెక్నీషియన్స్, ఎలక్ట్రీషియన్, అసోసియేషన్ యూనియన్ సభ్యులు పోలేపల్లి రాంనగర్ ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్లో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉంటూ అర్హులైన వారు లేబర్ కార్డులు తీసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ఉండడం వల్ల బీమా సౌకర్యం ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నజీర్, జీడిమెట్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ఉప్పు పంచప్ప, ప్రధాన కార్యదర్శి ఎస్. కే. దావుద్, జాయింట్ కార్యదర్శి పరిపూర్ణాచారి, కోశాధికారి షకీల్, ఆర్గనైజర్ ప్రవీణ్, యాదయ్య, ఇంచార్జ్ రామాచారి, బాలాపురం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్, నగేష్, కోశాధికారి, మహమ్మద్ మజర్ అలీ బేగ్ (బాషా), తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఇవ్వండి

## - ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు - కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మైనంపల్లి రోహిత్






**చిన్న శంకరంపేట్ - ప్రభాత సూర్యుడు:** నాకు రాజకీయ బిక్ష పెట్టిన మెదక్ నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసుకునే అవకాశాన్ని తన కొడుకు మైనంపల్లి రోహిత్ కు కల్పించాలని మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కోరారు. చిన్న శంకరం పేట మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుండి మెదక్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక వెనుకబడిందని పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రం నుండి సుమారు 18 ప్రభుత్వ సంస్థలను సిద్దిపేటకు కెసిఆర్ కుటుంబ సభ్యులు తరలించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన మెదక్ నియోజకవర్గ ప్రజల ముందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన కొడుకు మైనంపల్లి రోహిత్ ను నిలబెడుతున్నానని, మెదక్ ఎమ్మెల్యేగా రోహిత్ ను ఆశీర్వదించి, మెదక్ ప్రజలకు మరింత సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంత రావు కోరారు. సభాధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఆవుల గోపాల్ రెడ్డి , శంకరంపేట్ పట్టణ సర్పంచ్ రాజిరెడ్డి , రామయంపేట్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్ ముదిరాజ్ ,న్యాయవాది జీవన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీమాన్ రెడ్డి , ఉప సర్పంచ్ జీవన్, ఎర్రి కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శివకుమార్, కాంగ్రెస్ ఎస్టి సెల్ అధ్యక్షుడు అశోక్ నాయక్ , ఓయూ కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్ , మేడి గణేష్ ముదిరాజ్, రమేష్ గౌడ్ , గడిల సుధాకర్ , పాపయ్య గారి రామిరెడ్డి మరియు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాలుగవసారి ఎమ్మెల్యే గెలవాలని లక్ష్మీనరసింహస్వామి దర్శనం

## మాజీ జెడ్పిటిసి కర్నాటి రమేష్ గౌడ్



**యాచారం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి నాలుగవసారి అఖండ మెజారిటీతో గెలవాలని కోరుతూ యాచారం మండల మాజీ జెడ్పిటిసి బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కర్నాటి రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని ఈ అభివృద్ధి ఎమ్మెల్యేకె సాధ్యమైందని ప్రజలు సుఖశాంతులతో వెలగాలని అందరి ఆదరణ అభిమానాలతో ఈసారి గెలవాలని కోరుకుంటూ ఆ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి ఉండాలని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమంలో యాచారం మండల జడ్పిటిసి చిన్నోల్ల జంగమ్మ యాదయ్య బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపి జిల్లా కార్యదర్శిగా

# పీసరి నర్సయ్య నియామకం

**కోరుట్ల - ప్రభాత సూర్యుడు :** భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా పీసరి నర్సయ్య ను నియమించినట్లు ఆ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు మోరపల్లి సత్యనారాయణ రావు ఓ ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా పిసరి నర్సయ్య మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు మోరపల్లి సత్యనారాయణరావు, నియోజకవర్గంలోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు వివిధ హోదాల్లో ఉన్న నాయకులందరి ఆయన కృతజ్ఞతలు తెలిపారు..తమపై నమ్మకం ఉంచి,ఈ పదవి బాధ్యతను అప్పజెప్పినందుకు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. బిజెపి పార్టీ అంటేనే పేదల పార్టీ అని నరేంద్ర మోడీ అంటేనే పేదల నాయకుడని నరేంద్ర మోడీ సారాధ్యంలో పనిచేస్తున్న బిజెపి ప్రతి కార్యకర్త దేశ రక్షణ ధ్యేయంగా పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తామన్నారు..కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజలకు తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పార్టీ పరిపాలన గురించి ప్రజలకు వివరిస్తూ రాబోయే అసెంబ్లీ పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు..

## పెయిడ్ న్యూస్‌లపై

# గట్టి నిఘా

### పెయిడ్ న్యూస్‌ల పర్యవేక్షణకై ఎంసిఎంసి కమిటీల ఏర్పాటు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

శాసన సభ ఎన్నికనేపథ్యంలో నిర్వహించే ప్రచార కార్యక్రమాలకు సంబంధించి అడ్వర్‌టైజ్‌మెంట్‌లు, ప్రింట్ , ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, ఆడియో విడియో డిస్ ప్లే , సినిమా థియేటర్లు. రేడియో ఛానల్ లో బల్కు ఎస్ఎంఎస్ సెబ్ సైట్‌లో లప్రసారం చేసే వీడియో అడ్వర్‌టైజ్‌మెంట్‌లతో పాటుగా వాల్ రైటింగ్ డిస్ప్లే వాహనాలు ముందస్తుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నుండి అనుమతి పొందాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రో స్ స్పష్టం చేశారు. ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి, తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వివిధ వార్త పత్రికలు,ప్రింట్ ఎలక్ట్రానిక్ సోషల్ మీడియాలలో వచ్చే పెయిడ్ న్యూస్ గుర్తింపుకు ప్రత్యేకంగా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎం.సి.ఎం.సి)ని జి హెచ్ ఏం సి ప్రధాన కార్యాలయంలో సి పి అర్ ఓ సెక్షన్ లో ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. జిల్లా ఎన్నికల అధికారి చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఇన్‌ఫర్మేషన్ బ్యూరో డిప్యూటి డైరెక్టర్, సీనియర్ జర్నలిస్ట్, జీహెచ్ఎంసీ సీపీఆర్ఓ లను ఈ కమిటీలో హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ ను నియమించినట్టు రోనాల్డ్ రో స్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఏవైనా మీడియా అతిక్రమణలు జరిగితే ఈ కమిటి పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో, శాటిలైట్ ఛానెల్స్, లోకల్ కేబుల్ నెట్ వర్క్స్ లో ప్రసారమయ్యే అన్నిరకాల రాజకీయ ప్రకటనలను ఎంసిఎంసి కమిటి చే ముందస్తుగా అనుమతి పొందాలని, అదేవిధంగా పోలింగ్ రోజు, ముందురోజు ప్రచురితం అయ్యే ప్రింట్ ఎలక్ట్రానిక్ సోషల్ మీడియాఇతర మాధ్యమాలలో ప్రకటనలను కూడా అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి మతాలు, వర్గాలపై దాడి, దుర్భాషలు, అనుచిత వాఖ్యలు లేకుండా ఉండడం, హింసను ప్రేరేపించడం, కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉండడం, న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉండడం, దేశ సార్వభౌమత్వం ఐక్యతకు భంగం కలిగించేలా ఉండడం, వ్యక్తిగత దూషణలు లేకుండా తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని రాజకీయ ప్రకటనలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రింటింగ్ ప్రెస్ వారు కూడా అనుమతి తీసుకోవాలి అన్నారు. ప్రింటింగ్ చేసే పోస్టర్లు, కర పత్రాలలో ఎలాంటి విలేకుండా ఉండాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు పోటిచేసే అభ్యర్థులకు మాత్రమే హైదరాబాద్ జిల్లా ఎంసిఎంసి కమిటీ చే రాజకీయ ప్రకటనలకు అనుమతి జారీచేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, రిజిస్ట్రార్ అయిన రాజకీయ పార్టీలు రాజకీయ ప్రకటనలకు సంబంధించి రాష్ట్ర స్థాయి ఎంసిఎంసి కమిటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

## కారును పోలిన

# గుర్తులను తొలగించండి

### ఎన్నికల కమిషన్ పై ఢిల్లీ హైకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రిట్ పిటిషన్




**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

కారును పోలిన గుర్తులను తొలగించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలను జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నికల కమిషన్ ఫ్రీ సింబల్స్ లిస్ట్‌లో ఉన్న రోడ్డు రోలర్‌లాంటి గుర్తులతో బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలుగుతుందని పిటిషన్‌లో పేర్కొనగా.. దీనిపై నేడు విచారణకు వచ్చే అవకాశం ఉన్నది. అయితే, బీఆర్ఎస్ ఎన్నికల గుర్తయిన కారును పోలిన గుర్తులను ఏ పార్టీ, అభ్యర్థికి కేటాయించొద్దని ఎన్నికల కమిషన్‌ను బీఆర్ఎస్ కోరుతూ వస్తున్నది. 2011లో రోడ్డు రోలర్‌ను ఎన్నికల కమిషన్ తొలగించింది.గుర్తును మళ్లీ ఎన్నికల కమిషన్ చేర్చడంతో అభ్యంతరం తెలుపుతున్నది. రోడ్డు రోలర్‌తో పాటు చపాతి రోలర్, సోప్‌డిష్, టెలివిజన్, కుట్టుమిషన్, ఓడ, ఆటోరిక్షా, ట్రక్కు గుర్తులు కారును పోలి ఉండడంతో త్వరలో జరిగే ఎన్నికల్లో ఎవరికీ కేటాయించొందని బీఆర్ఎస్ ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. ఆయా గుర్తులతో బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ఇటీవల కేంద్రం ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించిన సందర్భంలోనూ కారు గుర్తును పోలిన ఫ్రీ సింబల్స్‌ను తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ కోరింది. అయితే, ఇప్పటి వరకు ఎన్నికల సంఘం స్పందించకపోవడంతో పిటిషన్‌ను దాఖలు చేసింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215